

కురుమూర్తికి పోటెత్తిన భక్తులు

కురుమూర్తిస్వామి జాతరకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

వివరాలు 6లో ▶



..అవగాహన ఉండాలి

కష్టసుఖాలు పంచుకునే సమాజం అవసరమని చినజీయర్‌స్వామి అన్నారు.

వివరాలు 6లో ▶

గరిష్ఠం/కనిష్ఠం
31.8 /20.7

వాతావరణం

ఉదయం, సాయంత్రం చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడే అవకాశం ఉంది.



'పేట'కు టెక్స్‌టైల్ పార్కు

- చేనేత కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి
- మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు
- తెలంగాణలో బీసీ సీఎం.. కేంద్రంలో పీఎం మోదీని చేద్దాం
- మక్తల్ బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

నారాయణపేట/ మక్తల్: ఈ ప్రాంతంలో అత్యధికంగా ఉన్న చేనేత కార్మికుల ఉపాధి అవకాశాలు పెంచి.. జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు నారాయణపేట జిల్లాకేంద్రంలో చేనేత కార్మికుల కోసం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఆదివారం మక్తల్‌లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకువస్తే బీసీ సీఎం అవుతారని.. రాబోయే రోజుల్లో కేంద్రంలో నరేంద్రమోదీని మరోసారి పీఎం చేద్దామంటూ ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చాక దేశంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధి ఏర్పాటు చేస్తామన్నారు. కార్మికులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు వారి జీవన పరిస్థితులపై నరేంద్రమోదీ అధ్యయనం చేస్తున్నారని పేర్కొన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని విమర్శించారు. మక్తల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి, డిగ్రీ కళాశాలకు నోచుకోలేదని, నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నాయకులు మక్తల్‌లో భూ కబ్జాలు, దాందాలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే భీమా ప్రాజెక్టును పూర్తి చేస్తామని, ఊట్కూర్ చెరువుతోపాటు జాయమ్మ చెరువుకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీలు నెరవేరాలంటే జిల్లాలోని బీజేపీ అభ్యర్థులు మక్తల్‌లో మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, నారాయణపేటలో రతంగ్ పాండురెడ్డి, కొడంగల్‌లో బంటు రమేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



మక్తల్‌లో సభకు హాజరైన ప్రజలు

బీజేపీతోనే సంక్షేమ పాలన

బీజేపీతోనే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేసేందుకే ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు, మక్తల్ ప్రజలు బీజేపీకి పట్టం కట్టడం ఖాయమని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలిచినా.. ఓడినా.. పేదలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోలార్ ఎంపీ మునిస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్మన్ అఖిలారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బాల్‌రాంరెడ్డి, తిమ్మప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు విద్యాసాగర్, కనకరాజు, మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, ఉపాధ్యక్షుడు సోంశేఖర్‌గౌడ్, నాగప్ప, కౌన్సిలర్లు కౌసల్య, సత్యనారాయణ, అర్చన, కొండయ్య, నాయకులు లక్ష్మణ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, రాములు తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్ర బహిరంగ సభకు హాజరైన జనం

ఇందిరమ్మ రాజ్యం రావాలి

నారాయణపేట, దేవరకద్ర, మహబూబ్‌నగర్ సభల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- అప్పుడే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- కాంగ్రెస్ అభ్యర్థులందరినీ గెలిపించాలి..
- ఆదర్శ జిల్లాగా మార్చే బాధ్యత నాదే..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/స్టేషన్ మహబూబ్‌నగర్/దేవరకద్ర/నారాయణపేట: 'జిల్లా అభివృద్ధి బాట పట్టాలన్నా.. సాగు నీటి ప్రాజెక్టులతో పాటు జిల్లాలోని వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలన్నా ఇందిరమ్మ రాజ్యం రావాలి' అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉమ్మడి జిల్లా పరిధిలోని నారాయణపేట, దేవరకద్ర విజయభేరి సభలు, మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పాలమూరువ్యాప్తంగా 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, ఆదర్శ జిల్లాగా మార్చే బాధ్యత తనదేనన్నారు. పాలమూరును పసిడి పంటలతో కళకళలాడేలా చేస్తామని, నిరుద్యోగ సమస్యను నిర్మూలించి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ వస్తే డీడీలు కట్టిన యాదవులకు గొర్రెలు ఇవ్వదని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ కన్నా మరిన్ని మంచి పథకాలు అమలు చేస్తామన్నారు.

హామీలు విస్మరించి మోసం..

కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని రేవంత్ ధ్వజమెత్తారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగు నీరు, వంద పడకల ఆస్పత్రి ఇచ్చిండా.. మైనార్టీలు, గిరిజనులకు 12 శాతం చొప్పున రిజర్వేషన్, వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాడా, మొదటి ఎమ్మెల్సీ ఇచ్చాడా.. నారాయణపేట-కొడంగల్ పథకం పని మొదలు పెడతానని పెట్టిండా.. కృష్ణా-వికారాబాద్ రైల్వే లేన్ తెచ్చిండా అని ప్రశ్నించాడు. ఏ ముఖం పెట్టుకుని కేసీఆర్ ఓట్లు అడుతున్నారని మండిపడ్డారు.

పక్కాగా 6 గ్యారంటీల అమలు..

దేశం నుంచి నరేంద్రమోదీని పారదోలేందుకు రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర నిర్వహించారని రేవంత్ గుర్తు చేశారు. తాను పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గానికి రాహుల్‌గాంధీ ఇప్పటికే చేరుకున్నారని.. అయినా ఇక్కడున్న అరాచక శక్తులను వంద మీటర్ల గోతి తీసి పాతిపెడతానని చెప్పడానికి పాలమూరు గడియారం చౌరస్తాకు వచ్చానన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అధికారం మన చేతిలో ఉండాలని.. నిధుల కేటాయింపు మన చేతిలో ఉండాలని.. మనం సంతకం చేస్తే మన జిల్లాకు వేల కోట్లు వరదలై పారాలని.. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పూర్తి కావాలన్నారు. వడ్డించే వాడు మన వాడు అయితే ఏ పార్టీ ఉన్నా మనకు ఇంత బువ్వ దొరుకుతుందన్నారు. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి, అన్ని వర్గాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.



ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్‌ఎస్: మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర ప్రజల సమస్యల గురించి బీఆర్‌ఎస్ వాళ్లు పట్టించుకోవడం లేదని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రాల్లో మెరుగైన ఆస్పత్రులు, కళాశాలలు లేవన్నారు. నియోజకవర్గ కేంద్రంలో సోయి లేకుండా ఆర్వోబీ నిర్మాణం చేసి పట్టణాన్ని రెండుగా విడగొట్టారని ధ్వజమెత్తారు. దీంతో పెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం రూపురేఖలు కోల్పోయిందన్నారు. కనీసం అండర్‌పాస్ బ్రిడ్జి కట్టించాలనే ఆలోచన కూడా వారికి లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మండలంలో 30 పడకలు, నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రితో పాటు డిగ్రీ కళాశాల, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కోయిల్‌సాగర్ నీటిని మండలంలోని అన్ని గ్రామాలకు అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, విజయసారథిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, శెట్టిశేఖర్, యుగంధర్‌గౌడ్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ



మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



క్లాక్‌టవర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

కాంగ్రెస్‌వి గ్యారంటీ మాటలు.. యెన్నం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని ఆ పార్టీ మహబూబ్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చెప్పేవి గ్యారంటీ మాటలని, సంక్షేమ పథకాల అమలు తమతోనే సాధ్యమన్నారు. ఉమ్మడి పాలమూరులో 14 స్థానాల్లో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాధా అమర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్ కుమార్, సంజీవ్ ముదిరాజ్, నాయకులు ఎన్పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, రాఘవేందర్‌రాజు, మధుసూదన్‌రెడ్డి, సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చిత్రంలో ఎంపీ లక్ష్మణ్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థులు మిథున్‌రెడ్డి, కొండా ప్రశాంత్‌రెడ్డి, చిత్తరంజన్‌దాస్

బీజేపీని గెలిపించాలి

బీజేపీ విజయ సంకల్ప సభలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

- ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/పాలమూరు: 'బీజేపీ ప్రభుత్వంలో దేశంలోని ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం. దేశంలో నూతన ఆవిష్కరణలు, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశాం. తెలంగాణలో అవినీతి రహిత పాలన కోసం బీజేపీని గెలిపించాలి.' అని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఆదివారం బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. శ్రీకాళేశ్వరం, శ్రీశైలం, ద్రాక్షారామం కోటి నమస్కారాలు అంటూ ప్రసంగం మొదలుపెట్టారు. మోదీ హయాంలో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయి. వందే భారత్ రైలు, హైవే, ఎయిర్ పోర్టులను అభివృద్ధి చేశాం. హవాయి చెప్పులు తొడిగేవారు కూడా ఈ రోజు విమానాల్లో ప్రయాణించే అవకాశం కల్పించాం. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. జనవరి 22న అయోధ్య రామమందిర్‌లో మోదీ చేతుల మీదుగా ప్రతిష్ఠాపన జరుగుతున్నట్లు తెలిపారు. పాలమూరు నుంచి ఎంతమంది రామభక్తులు రావాలని కోరుకుంటున్నారో చెప్పాలన్నారు. అయోధ్య రాముడి దర్శనానికి అందరూ రావాలని.. ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. మిథున్‌రెడ్డితో పాటు బీజేపీ అభ్యర్థులందరినీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మొద్దు

తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ప్రతి పేదవాడి కల సాకారం అవుతుందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. తెలంగాణలో కేసీఆర్ అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, ఇంటికి అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటాడు.. అందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తానని మోసం చేశాడన్నారు. బీఆర్‌ఎస్- కాంగ్రెస్ పార్టీల డీఎన్‌ఏ ఒక్కటేనని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ఏమాత్రం నమ్మరాదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ గులాబీ కండువా ఉన్నవారికి మాత్రమే పింఛన్, దళితబంధు ఇచ్చిందని ఆరోపించారు.

బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30 తర్వాత కారు.. సారు.. సర్కారు షెడ్‌కు వెళ్తాయని, పాలమూరు పూర్తిగా కాషాయమయంగా మారబోతోందన్నారు. కమలం పువ్వుకు ఓటు వేసి గెలిపిస్తే పాలమూరులో ఎమ్మెల్యే ట్యాక్సీ, బెదిరింపులు, భూ దందాలు ఉండవన్నారు. ఐటీ సెక్టార్‌లో ఉద్యోగాలు, కాలుష్యం లేని పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికే గ్యారంటీ లేదని, ఆ పార్టీ ఇచ్చే పథకాలకు అసలే గ్యారంటీ లేదన్నారు. ఎన్నికల్లో ఒకటో నంబర్‌పై నొక్కి.. ఒకటో నంబర్ కుర్రాడిని ఆశీర్వదించాలని కోరారు.



యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ని గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి అవుతాడన్నారు. పాలమూరులో బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని గెలిపిస్తే అయోధ్య రామమందిర దర్శనం ఉచితంగా చేయించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

■ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఒకటో నంబర్‌పై నొక్కి మిథున్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పాలమూరు సంరక్షణ, కబ్జాలు, బెదిరింపులు లేకుండా బీజేపీ చూసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, జడ్చర్ల, దేవరకద్ర ఎమ్మెల్యే అభ్యర్థులు చిత్తరంజన్‌దాస్, కొండా ప్రశాంత్‌రెడ్డి, పద్మజారెడ్డి, బాలరాజు, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైడ్‌లైట్స్

- సభ వేదిక దగ్గరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్యాహ్నం 12.59 వచ్చారు.
- మధ్యాహ్నం 1.18 గంటలకు మాట్లాడటం ప్రారంభించి 1.35 గంటలకు ప్రసంగం ముగించారు.
- వేదికపైకి వచ్చిన తర్వాత మూడు నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి విజయసంకేతం చూపించారు.
- యోగి రాక సందర్భంగా పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించారు.
- పాలమూరుకు వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని యోగి అన్నారు. నా మిత్రుడు, అప్పటి పార్లమెంట్ సభ్యుడు జితేందర్‌రెడ్డిని కలిసే అవకాశం వచ్చింది. జితేందర్‌రెడ్డి ఈ ప్రాంత సమస్యలపై, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు.

ఓటుహక్కు వినియోగించుకున్న పోలీసులు



పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: శాసనసభ ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసులు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఆదివారం ఐడీఓసీ కార్యాయంలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రాల్లో పోలీసులు తమ ఓటుహక్కును పోస్టల్‌బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకు బారులు తీరారు. గద్వాల నియోజకవర్గంలో మొత్తం పోలీసు సిబ్బందికి సంబంధించి 162 పోస్టల్ బ్యాలెట్ ఓట్లుండగా.. 74 మంది సిబ్బంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా అలంపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 272 పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కులుండగా 80 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వల్లూరు క్రాంతి, గద్వాల ఆర్‌ఓ అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ పర్యవేక్షించారు. ఈ నెల 3న జరిగే పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ తహసీల్దార్ నరేందర్, సరితరాణి, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం..

దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించేలా భారత రాజ్యాంగాన్ని రచించారని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఆదివారం ఐడీఓసీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సాంఘిక, ఆర్థిక, భావప్రకటన, ధర్మం, సమానత్వం, ఐక్యమత్యం వంటి ప్రధాన హక్కులను అన్ని వర్గాల ప్రజలకు కల్పిస్తూ.. 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్లశ్రీనివాసులు, తహసీల్దార్ నరేందర్, జ్యోతి, సరితరాణి, రమేష్‌బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రియాంక గాంధీ రాక

గద్వాల అర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ గద్వాలకు రానున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని మేలచెర్వు రోడ్డులోని(తెలంగాణ చౌరస్తా) వద్ద సభా స్థలం వద్దకు చేరుకుంటారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని నాయకులు తెలిపారు. ఈ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. అదేవిధంగా సభకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల పరిధిలోని షేకుపల్లిలో కోదండాపురం ఎస్‌ఐ కృష్ణదేవా ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర బలగాలతో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పోలీస్ కళా బృందం సభ్యులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ.. ఓటర్లకు ఎన్నికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కృష్ణదేవా, పోలీస్ కళాబృందం సభ్యులు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఎవరికి భయపడకుండా తమకు ఇష్టం ఉన్నవారికి తమ ఓటును వేసుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: ఎన్నికలకు కేవలం మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఆదివారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్ పోస్టును ఎక్సైజ్ సీఐ ఖలీద్ పోలీసుల ఆధ్వర్యంలోని తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతో పాటు తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఐటీబీపీ పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

గట్టు: గట్టులోని పెద్ద చెరువుకట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక దీపోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గట్టుకు చెందిన వీరశైవలింగాయత్ సంఘం సభ్యులు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయంలోని శివలింగంతో పాటుగా నందీశ్వరుని చుట్టూ కార్తీక దీపాలు వెలిగించారు.



నందీశ్వరుని చుట్టూ దీపాలు వెలగిస్తున్న భక్తులు

కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ ఇంటిపై
అర్ధరాత్రి ఎన్నికల అధికారుల దాడులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ ఇంటిపై ఎన్నికల అధికారులు ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. వడ్డేపల్లి శాంతినగర్‌లోని ఆయన నివాసంలో సోదాలు నిర్వహించారు. ఎలాంటి సొమ్ము దొరకలేదని తెలిసింది. ఈ సమయంలో సంపత్ ఇంట్లో లేరని సమాచారం. అయితే అధికారుల దాడులతో బెంబేలెత్తిన ఆయన భార్య మహాలక్ష్మి సొమ్మసిల్లి పడిపోవడం ఆందోళనకు దారి తీసింది. ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ప్రస్తుతం కోలుకుంటున్నట్లు సమాచారం. అయితే సంపత్ ఇంటిపై దాడుల సమాచారం అందుకున్న కాంగ్రెస్ శ్రేణులు ఆయన ఇంటికి చేరుకుంటుండగా.. స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సమయం.. సరిపోవట్లే!

మధ్యాహ్నం కాంగ్రెస్.. రాత్రికి బీఆర్‌ఎస్..

1400 మంది ఓటర్లే ఎందుకు

- వివరాలు 6లో..

1400 మంది ఓటర్లే ఎందుకు?

అచ్చంపేట: ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 మంది ఓటర్లు మాత్రమే ఉంటారు. సాధారణ ఎన్నికల్లో ఆ కేంద్రం పరిధిలో ఉన్న వారినే ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎందుకంటే.. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో వినియోగిస్తున్న ఈవీఎంలకు అనుసంధానించే వీవీ ప్యాట్ థర్మల్ కాగితం స్లిప్పులను 1500 మాత్రమే ముద్రించగలుగుతుంది. 22.5 ఓల్టేజీ బ్యాటరీతో పనిచేసే వీవీ ప్యాట్‌లో ఓటరు ఎవరికి ఓటు వేశారనేది కాగితం స్లిప్‌పై కనిపిస్తుంది. అయితే ఇందులో 100 వరకు కాగితపు స్లిప్‌లు మాక్ పోలింగ్ ప్రక్రియలోనే ఖర్చవుతాయి. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 మందికి మాత్రమే ఓటు వేసేందుకు అనుమతి ఇస్తారు.

పదేళ్లలో రాష్ట్రం దివాళా తీసింది

- తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం
- జనం చూస్తుంటే శ్రీహరి గెలిచినట్లే..
- మక్తల్ రోడ్‌షోలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



రోడ్ షోలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు



మక్తల్ రోడ్ షోలో మాట్లాడుతున్న సీఎం సిద్ధరామయ్య

నారాయణపేట/ మక్తల్: 'పేద కుటుంబం నుంచి వచ్చిన వాకిటి శ్రీహరిపై వేలాదిగా తరలివచ్చిన జనాభిమానాన్ని చూస్తుంటే మక్తల్‌లో ఆయన గెలిచినట్లే.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమ'ని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మక్తల్ రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఇద్దరు దొంగలేనని.. తెలంగాణలో కొనసాగుతున్న దొరలు, దొంగల పాలనను ప్రజలందరూ కలిసి సాగనంపాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడి పదేళ్లు గడిచినా చేసిందేమి లేదని.. రాష్ట్రాన్ని దివాళా తీయించారన్నారు. కేసీఆర్ హయాంలో ఆర్థిక పరిస్థితి దెబ్బతినడంతో అప్పుల కుప్పగా మార్చారని దుయ్యబట్టారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, కానీ, ఇక్కడ స్వార్థ ప్రయోజనాల కోసం తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూన్‌- 11న శక్తి యోజన పథకం ప్రారంభించి రూ.10 కోట్లతో మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. సీఎం కేసీఆర్ జిమ్మిక్కులను ప్రస్తుతం ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయం అని విశ్వసిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 24 గంటల ఉచిత విద్యుత్ అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తుందని.. బీజేపీ సైతం అదేబాటలో పనిచేస్తుందన్నారు. అంతకు ముందు కుర్వలు సీఎం సిద్ధరామయ్యను గొంగడితో సన్మానించారు.

ఒక్క అవకాశం కల్పించండి

మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే మక్తల్ నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి, టీపీసీసీ గౌడ సంఘం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్‌యాదవ్, నాయకులు గోపాల్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, సిద్దార్థరెడ్డి, నాగరాజు, నీలప్ప, రామారావు, తాయప్ప, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిత్రాలు..

వాలీబాల్ ఆట.. ఓట్ల వేట..



మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వాలీబాల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. - మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ..



గద్వాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాలినడకన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. - గద్వాల రూరల్

బొట్టు పెట్టి.. హారతి పట్టి..



అమరచింత పట్టణంలో మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి సతీమణి లలిత ప్రచారం చేపట్టగా.. స్థానిక మహిళలు బొట్టు పెట్టి హారతి పట్టారు. - అమరచింత

కట్టింగ్ చేస్తా.. ఓటు పడుతా



గోపాల్‌పేట మండలం నాగపూర్‌లో ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.. ఓ సెలూన్ షాపులో కట్టింగ్ చేసి ఆకట్టుకున్నారు. - గోపాల్‌పేట

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోస్గి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గుండుమాల్ మండలం బోగారం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బోగారం గ్రామానికి చెందిన గంగప్ప (38) కోస్గిలోని అత్తగారింట్లో భార్యాపిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. అప్పుడప్పుడు స్వగ్రామానికి వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి మరో వ్యక్తి..



బోయినిరాజు(ఫైల్)

పాన్‌గల్: బైక్ అదుపు తప్పి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జమ్మాపూర్ చెందిన బోయినిరాజు(40) మేస్త్రీ పనులు చేస్తూ హైదరాబాదులో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల సొంత గ్రామానికి వచ్చిన ఆయన ఆదివారం తెల్లవారుజామున గ్రామం నుంచి బైక్‌పై వనపర్తికి వెళ్తూ దావాజిపల్లి సమీపంలో ఇటుకల బట్టి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్క రాతిపై కిందపడ్డాడు. తలకు బలమైన గాయమై రోడ్డు పక్క వరి చేనులో పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి చిన్నరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

నారాయణపేట రూరల్: ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. నారాయణపేట సమీపంలోని జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం సీఐ రవిబాబు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా.. రూ.1,32,454 విలువగల 120.042 లీటర్ల లిక్కర్ పట్టుబడింది. లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

దాడులు, ప్రతిదాడులతో అట్టుడుకుతున్న కోస్గి



బీఆర్‌ఎస్ నేతల దాడిలో గాయపడిన బాధితుడిని పరామర్శిస్తున్న తిరుపతిరెడ్డి(ఫైల్)

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, అనుచరులపై హత్యాయత్నం కేసు

కోస్గి: ఓటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్ది కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య పోరు ముదురుతుంది. ముఖ్యంగా కోస్గి మండలంలో ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు నువ్వా నేనా అన్నట్లు కయ్యానికి కాలు దువ్వుకుంటున్నారు. ప్రచార హోరు పక్కన పెడితే ఏకంగా దాడులు, ప్రతిదాడులతో మండలంలో భయంకరమైన వాతావరణం సృష్టించడంతో ప్రజలు తీవ్ర భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పాటు అతని కుమారుడు, అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కుమారుడు హితీష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం ముదిరెడ్డిపల్లి, అమ్లికుంట్లకు వెళ్లాడు. అక్కడ కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు డబ్బులు పంచడానికి వచ్చారంటూ వాహనాన్ని అడ్డుకోవడంతో వెనుదిరిగినప్పటికి అమ్లికుంట్ల, బోగారంలో రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేసి వాహనాన్ని ఆపి దాడి చేశారు. వాహనం ధ్వంసమైంది. ఈ క్రమంలో అదేరోజు అర్ధరాత్రి కాంగ్రెస్ కార్యకర్త కూర నరేష్ ఓ ఫంక్షన్‌హాల్‌లో పెళ్లి డెకరేషన్ పనులు ముగించుకొని వెళ్తున్న క్రమంలో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు అతన్ని ఆపి మూకుమ్మడిగా దాడి చేసి కారులో బలవంతంగా ఎత్తుకెళ్లి తీవ్రంగా కొట్టారు. తలపగిలి తీవ్ర గాయాలతో ఉన్న నరేష్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంలో ఇరు పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ కార్యకర్తలు మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష ఇంటికి, ఇతర నాయకుల ఇళ్లకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. రేవంత్‌రెడ్డి సోదరుడు బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, అతని కుమారుడు హితీష్‌రెడ్డితోపాటు మున్సిపల్ చైర్ పర్సన్ భర్త మ్యాకల రాజేష్, కౌన్సిలర్ బాలేష్, బోరబండ కార్పొరేషన్ బాబా ఫసీయోద్దీన్, వెంకట్‌నర్సింహులు, మీర్జాపూర్ రాజేందర్‌రెడ్డి, కోనేరు సాయప్ప, అమీర్ షేక్‌పై హత్యాయత్నంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా శనివారం అర్ధరాత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి తన అనుచరులతో వచ్చి ప్రతాప్‌రెడ్డి ఫాంహౌస్‌లో నుంచి వస్తున్న క్రమంలో తనపై, తన అనుచరులపై దాడి చేసి గాయపరచడంతోపాటు తన వాహనాన్ని వెంబడించి హత్యాయత్నం చేశారని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియోద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతవారం ఏకంగా పోలీసు స్టేషన్‌లోనే ఇరుపార్టీల నేతలు గొడవ పడి రాళ్లతో దాడులు చేసుకోవడం, ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. తాజా దాడులు, ప్రతిదాడులతో కోస్గిలో గతంలో ఎన్నడూ లేని విధంగా కొనసాగుతున్న ఎన్నికల రణరంగంతో ప్రజలు తీవ్ర భయందోళకు గురవుతున్నారు.

కురుమూర్తికి పోటెత్తిన భక్తులు



చిన్నచింతకుంట: కురుమూర్తి కొండలలో కురుమూర్తి రాయ గోవిందా.. గోవింద అంటు నామస్మరణలు మార్మోగాయి. పాలమూరు ప్రజల ఆరాధ్యదైవమైన అమ్మాపురం కురుమూర్తి స్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం కావడంతో పట్టణ, పల్లెల నుంచి భక్తులు పిల్లాపాపలతో భారీగా తరలివచ్చారు. తెల్లవారుజామునే పూజారులు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. గండదీపాలు మోసి పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా సమర్పించారు. పిల్లలు, పెద్దలు జాతర మైదానంలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, వాటర్‌బోట్, స్ప్రింగ్ జంపింగ్ ఎక్కి సంబురపడ్డారు.

పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కరువు

జాతరలో పారిశుద్ధ్యంపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఉత్సవాలు ప్రారంభమైన మొదట్లో విస్తృతంగా పనులు చేపట్టారు. రెండు, మూడు రోజులుగా పర్యవేక్షణ కరువు కావడంతో జాతరమైదానంలో మాత్రమే నామమాత్రంగా పనులు చేపడుతున్నారు.



కులాల మధ్య పరస్పర అవగాహన ఉండాలి

- వాసవీ విజయ మహోత్సవంలో త్రిదండి చినజీయర్ స్వామి



సందేశమిస్తున్న చినజీయర్‌స్వామి

జడ్చర్ల టౌన్: కులాల మధ్య పరస్పరం అవగాహన ఉండి సుఖదుఃఖాలను పంచుకునే మనస్థత్వం కలిగిన సమాజం అవసరమని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన వాసవీక్లబ్ 3వ కాన్ఫరెన్స్, వాసవీ విజయోత్సవానికి ఆయన హాజరై మంగళాశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి సందేశమిస్తూ.. రాజకీయ నాయకులు కుల నిర్మూలన చేస్తాం.. కులరహిత సమాజం స్థాపిస్తామని చెప్పడమనేది అంత మంచిమాట కాదన్నారు. ఆ మాటెలా ఉంటుందంటే.. సమాజం అనే శరీరంలో అవయవాలన్నింటి మధ్య తేడాలు తీసేస్తాం.. అన్నింటిని సమానంగా చేస్తామన్నట్లుగా ఉంటుందన్నారు. కులరహిత సమాజం అవసరం లేదని, ఒకరి కోసం ఒకరు పనిచేయాలని, ఇది సమాజానికి అవసరమైన స్థితిగా అభిప్రాయపడ్డారు. కులం ఉంటేనే వాళ్ల వాళ్ల పనులు సవ్యంగా చేయగలుగుతారన్నారు. ఈ విషయంపై అందరికీ అవగాహన కలగాలన్నారు. రామానుజచార్యుల వారు కాంచిపూర్ణుల వారి ప్రేరణతో సమాజానికి అందించిన సందేశం ఇదేనన్నారు. పూర్వులు చూపిన మార్గంలో అందరూ పయనించాలన్నారు. రామానుజచార్యులకు ప్రేరణ ఆర్యవైశ్యుడైన కాంచిపూర్ణుల వారన్నారు. వారి స్ఫూర్తితోనే అద్భుతమైన వికాసం కలిగి ఉత్తమమైన ఆధ్యాత్మిక వేత్తగా సమాజానికి సేవలు అందించినట్లు తెలిపారు. ఆయనకు వెయ్యేళ్ల గుర్తుగా వారి మూర్తిని 108 దివ్యదేశాల స్ఫూర్తితో ఏర్పాటు చేసుకున్నామన్నారు. వాసవీక్లబ్, ఆర్యవైశ్యులు మంచి పనుల్లో ముందుంటారని ప్రశంసించారు.

ఫిబ్రవరి 19నుంచి రెండవ వార్షికోత్సవం

2024 ఫిబ్రవరి 19 నుంచి పాల్మాకుల వద్ద ఉన్న రామానుజచార్యుల సమతా స్ఫూర్తి కేంద్రంలో 2వ వార్షికోత్సవాన్ని సమతాకుంభ్ పేరుతో నిర్వహిస్తున్నట్లు చినజీయర్ తెలిపారు. వేడుకలకు అందరూ హాజరు కావాలని కోరారు. త్రిదండి రామానుజచార్యులు ఇచ్చిన సందేశం స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. పూర్వులైన కాంచిపూర్ణుల ప్రేరణ స్వీకరించి చక్కటి సమతా సందేశం, సేవాస్ఫూర్తిని సమాజానికి అందించగలిగే ఉత్తమ ధార్మికులు కావాలని మంగళాశాసనం చేశారు. విజయోత్సవంలో వాసవీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మేడిశెట్టి రామకృష్ణ, నూతన అధ్యక్షుడు జగదీష్ గుప్తాతోపాటు 103 క్లబ్‌ల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. వేడుకల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని వాసవీక్లబ్ సేవలను ప్రశంసించారు.

సమయం.. సరిపోవట్లే!



- నెలరోజులుగా అభ్యర్థులు బిజీబిజీ
- ప్రతి నిమిషాన్ని సద్వినియోగ పరచుకునేలా ప్లాన్
- రోజంతా ఉరకలు, పరుగులు

'ప్రచారంలో అటు తిరిగి ఇటు వచ్చే లోగా రోజు గడిచిపోతుంది. ఏ రోజు అనుకున్న పనులు ఆ రోజు అవట్లేదు. సమయం సరిపోవడం లేదు. పోలింగ్ సమయమేమో దగ్గరపడుతోంది. రోజుకు 28గంటలు ఉంటే బాగుండు.' ఇటీవల ఓ నాయకుడు తన అనుచరుల వద్ద చేసిన వ్యాఖ్య ఇది.

అచ్చంపేట: ఈ ఒకట్రెండు రోజులు చెమటోడ్చి కష్టపడితే ఐదేళ్ల పాటు హాయిగా వీఐపీ హోదాలో దర్జాగా ఉండవచ్చు. శాసనసభలో ప్రధాన పాత్ర వహిస్తూ అధికార దర్పంతో హాయిగా బతకవచ్చు. కాలం కలిసి వస్తే మంత్రి పదవి రావొచ్చు. అలాంటి రాజకీయ జీవితం కోసం అభ్యర్థులు ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. ఓవైపు ఉష్ణోగ్రతలు పడిపోయి గ్రామాలన్నీ మంచుదుప్పటి పరచుకుని ఉంటే.. అభ్యర్థులు చలిని సైతం లెక్క చేయకుండా తెల్లవారుజామునే ప్రచారం మొదలుపెడుతున్నారు. ఉదయం ఇంటి నుంచి బయల్దేరి రాత్రికి ఎప్పుడో తిరిగొస్తున్నారు. అభ్యర్థుల దినచర్య అత్యంత బిజీ షెడ్యూల్‌తో ప్రారంభమవుతోంది. అలసట, విశ్రాంతి అనే పదాలకు చోటులేకుండా ముందుకు సాగుతున్నారు.

సహాయకుల పరిస్థితి అంతే..

ఒక్క నిమిషం కూడా వృథా కాకుండా అభ్యర్థులు తమ షెడ్యూల్‌ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటున్నారు. కేవలం నిద్రించే సమయం తప్ప మిగతా సమయాన్ని మొత్తం ప్రచార పర్వానికే అంకితం చేస్తున్నారు. కాలంతో పరుగెడుతూ ఎన్నికల కుస్తీ పడుతున్నారు. బిజీ షెడ్యూల్‌తో అభ్యర్థులకు నెల రోజుల నుంచి కంటినిండ నిద్ర కరువైంది. గ్రామీణ ప్రజలు ఉదయమే వ్యవసాయ పనులకు వెళ్తుండటంతో వారిని కలిసేందుకు వీలైనంత త్వరగా ఇంటి నుంచి బయల్దేరుతున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు వేలాది మందిని ప్రత్యక్షంగా పలకరిస్తున్నారు. ఈ సమయంలో వారి వ్యక్తిగత సహాయకుల పాత్ర కీలకమవుతుంది. నిర్దేశించుకున్న పనులను నిర్ణీత సమయానికి గుర్తు చేయడం, అందరినీ సమన్వయం చేయడం వంటి బాధ్యతలు వీరు నిర్వర్తిస్తున్నారు. అలా అభ్యర్థులకు సహకారం అందిస్తూ సమయాభావ సమస్యను ఎదుర్కొంటున్నారు.

నెలరోజులుగా జనంలోనే..

అభ్యర్థుల ఇళ్ల వద్ద నిత్యం జనంతో కోలాహలం కనిపిస్తోంది. ఉదయం నుంచే వందలాది మంది నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీల అభ్యర్థులతో మాట్లాడేందుకు క్యూ కడుతున్నారు. దీంతో నిద్రలేచింది మొదలు ప్రచారతంతు ప్రారంభమవుతోంది. కిందిస్థాయి నేతలతో మాట్లాడుతూ గ్రామాలు, మండలాల్లో పరిస్థితిపై ఆరా తీసేందుకు కొంత సమయం కేటాయించాల్సి వస్తోంది. రోజు ఏదో ఒక చోటకు వెళ్లడం దిన చర్యలో తప్పనిసరిగా మారింది. నియోజకవర్గం మొత్తం చుట్టి రావడమే లక్ష్యంగా రోజువారీ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాలకు రాకపోకల సమయంలోనూ ముఖ్యనేతలతో ఎప్పటికప్పుడు పరిస్థితులపై చర్చిస్తున్నారు. అలాగే ప్రత్యర్థి పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహించేందుకు స్థానిక లీడర్ల సాయంతో కొంత సమయం కేటాయిస్తున్నారు. నియోజకవర్గానికి ఎవరైనా ముఖ్యనేతలు వస్తే జన సమీకరణ తదితర ఏర్పాట్లు చూసుకోవాల్సి వస్తోంది. ఇందుకోసం రోజులో ఎంతో కొంత సమయం కేటాయిస్తున్నారు.

దిన చర్య ఇలా..

- ఉదయం 5గంటలకు మేల్కొనడం
- 5నుంచి 6గంటల వరకు కాలకృత్యాలు తీర్చుకోవడం
- 6నుంచి 7లోగా స్నానం, టిఫిన్ చేయడం
- 7నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గ్రామాల్లో ప్రచారం, రోడ్ షోలు, చేరికలు, సభలు, ప్రెస్‌మీట్‌లు నిర్వహించడం
- 2నుంచి 4గంటల మధ్య మధ్నాహ్న భోజనం చేయడం
- సాయంత్రం 4నుంచి రాత్రి 10గంటల వరకు సభలు, సమావేశాలు, ర్యాలీల్లో పాల్గొనడం
- రాత్రి 10గంటలకు రాత్రి భోజనం తర్వాత ముఖ్యులతో మాటామంతి
- రేపటి దిన చర్య కోసం ప్లాన్ వేసుకోవడం
- ఆ రోజు అన్ని పనులు పూర్తయితే నిద్రకు ఉపక్రమించడం. ఈ తతంగం ముగిసే వరకు రాత్రి 12నుంచి 2గంటలు దాటుతోంది. ఒక్కోసారి ముఖ్యనేతల బహిరంగ సభలు ఉంటే తెల్లవారుజాము వరకు మేల్కొనే ఉంటున్నారు.

మధ్యాహ్నం కాంగ్రెస్.. రాత్రికి బీఆర్‌ఎస్..





ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక ,ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మధు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎన్నికలు అంటేనే చిత్ర, విచిత్రాలు చోటుచేసుకుంటాయి. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని ఓ నేత ఒకే రోజున రెండు పార్టీల కండువాలు కప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. తెలకపల్లి ఎంపీపీ కొమ్ము మధు శనివారం మధ్యాహ్నం బీఆర్‌ఎస్‌ను వీడి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తర్వాత కొద్దిసేపటికే రాత్రి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకుని తిరిగి సొంత గూటికి చేరుకున్నారు.

గద్వాల, కల్వకుర్తిలో రెండేసి ఈవీఎంలు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఒక్కో ఈవీఎంలో 15 మంది అభ్యర్థుల జాబితాను మాత్రమే రూపొందించేలా తయారు చేశారు. బ్యాలెట్ యూనిట్‌లోని 16వ బటన్ నోటా గుర్తుకు కేటాయించారు. 15మందికి పైగా అభ్యర్థులు ఉంటే రెండు ఈవీఎంలను వినియోగించాల్సి ఉంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా కల్వకుర్తి నియోజకవర్గంలో 24మంది, గద్వాలలో 20మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఈ రెండు నియోజకవర్గాల్లో రెండేసి ఈవీఎంలను ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొంది. - మహబూబ్‌నగర్ డెస్క్

అట్టహాసంగా కబడ్డీ జట్టు ఎంపిక



లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఆదివారం రాష్ట్ర స్థాయి పోటీలకు సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు పీడీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నలుమూలల నుంచి 70 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన 12 మందిని ఎంపిక చేశారు. వీరు డిసెంబర్ 4వ తేదీ నుంచి 6 వరకు నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌లో 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీల లో పాల్గొంటారని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, యాదయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కుమారస్వామి, మోహన్‌లాల్, రమేష్, అబ్దుల్లా పాల్గొన్నారు.